

కాటేసే కాలం.. అప్రమత్తత అవసరం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు కురుస్తున్నాయి. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే విష పురుగులతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. - 8లో



విద్యుత్ సమస్యలపై స్పందించాలి

విద్యుత్ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని ఏపీఎస్పీడీసీఎల్ కడప సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ ఆదేశించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
33.2/24.2

వాతావరణం

జిల్లాలో గురువారం 24.2- 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

డీసీసీబీ చైర్‌పర్సన్ రాజీనామా

కడప అగ్రికల్చర్: కడప డీసీసీ బ్యాంకు చైరపర్సన్‌గా ఉన్న మల్లెల ఝాన్సీరాణితోపాటు ఆరుగురు డైరెక్టర్లు తమ పదవులకు గురువారం రాజీనామా చేశారు. సంబంధిత రాజీనామా పత్రాలను డీసీసీ బ్యాంకు సీఈఓ రాజామణికి అందచేశారు. డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్‌గా మల్లెల ఝాన్సీరాణితోపాటు డైరెక్టర్లుగా ఉన్న నల్లలింగాయపల్లె సొసైటి ప్రెసిడెంట్ వెంకటసుబ్బారెడ్డి, చిట్వేల్ సొసైటీ సభ్యులు గంగాద్రి, వేల్పులు సొసైటీ సభ్యులు అంజనేయలు, దేవుని కడప సొసైటీ సభ్యులు ఉస్సేన్‌పీరా, సంబేపల్లి సొసైటీ ప్రెసిడెంట్ వెంకట్రామిరెడ్డి, వీవర్స్ సొసైటీ సభ్యురాలు రాజామణి 2021 జూలైలో బాధ్యతలను చేపట్టారు. తరువాత వీరి పదవుల కాలపరిమితిని పొడిగించుకుంటూ వచ్చారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో వీరంతా తమ పదువులకు రాజీనామా చేశారు.

వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయండి



కొర్రపాడులో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ సౌజన్య

రాజుపాళెం: టీబీ వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య పేర్కొన్నారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలోని హెల్త్ సెంటర్‌లోని రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ గ్రామాల్లోని వైద్య సిబ్బంది ఇంటి వద్దకు టీబీ వ్యాధి పట్ల అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం తీసుకోవాలని తెలిపారు. జిల్లా టీబీ అధికారి రవిబాబు, ప్రొద్దుటూరు టీబీ అధికారి శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ నిఖిల, పీమెచ్ఎస్ విమలమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, ఏఎన్ఎం మరియమ్మ, భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌కేవ్యాలీలో ఇంటరాక్టివ్ సెషన్



ఇంటరాక్టివ్ సెషన్ ప్రోగ్రాంలో ప్రొఫెసర్ బి.వి. రెడ్డి, తదితరులు

వేంపల్లె: ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో గురువారం ప్రొఫెసర్ బి.వి.రెడ్డితో ఇంటరాక్టీవ్ సెషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. కెనడా దేశంలోని అంటారియోటెక్ విశ్వవిద్యాలయం నుంచి విచ్చేసిన ఆయన టీచింగ్‌తో పాటు రిసెర్చ్‌లలో పురోగతి సాధించడంపై సూచనలతో పాటు పలు మెలకువలు గురించి అధ్యాపకులకు తెలియజేశారు. క్వాలిటీ పేపర్స్ రాసి, ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమయ్యేలా పలు దిశానిర్దేశాలు చేశారు. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించేందుకు బయోమాస్, సోలార్ ఎనర్జీ, బొగ్గును ఉపయోగించి హైబ్రీడ్ పవర్ జనరేషన్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, అకాడమిక్ డీన్ రత్నకుమారి, ఏఓ రవికుమార్, రమేష్, కొండారెడ్డి, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

విస్తరించిన రుతుపవనాలు




నైరుతి రుతుపవనాల విస్తరణతో కురుస్తున్న వర్షం

రాయచోటి: నైరుతి రుతుపవనాల విస్తరణతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. బుధవారం రాత్రి, గురువారం పగలు కూడా వర్షపు జల్లులు కురిశాయి. రుతుపవనాల ప్రభావంతో ఎగువ భాగంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు వెలిగల్లు ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతోంది. మూడు రోజులుగా ఓ మోస్తరుగా కురుస్తున్న వర్షాలకు చిన్నచిన్న వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. నైరుతు రుతుపవనాల ప్రభావంతో వర్షాలు అనుకూలిస్తుండటంతో ఖరీఫ్ రైతులలో ఆనందం వ్యక్తమవుతోంది. రానున్న మూడు రోజుల్లో వర్షాలు అనుకూలించి చెరువుల్లోకి నీరు చేరితే భూగర్భ జలాలు పెరుగుతాయన్న ఆశ ఉంది. రానున్న 24 గంటల్లో రాయలసీమ వ్యాప్తంగా పలుచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలపడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

మానవతా బంధం

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

కడప కల్చరల్: అవసరమైన వ్యక్తికి సరైన సమయంలో రక్తం ఎక్కించకపోతే ఆ జీవితం అక్కడితో అంతమైపోతోంది. అవసరమని అడిగితే అన్నం పెడతారు. దాహమంటే నీళ్లిస్తారు. కానీ అత్యవసరమని ప్రాధేయపడినా రక్తదానం చేసేవారు ఈ సమాజంలో కరువేనని చెప్పక తప్పదు. ఈ అవసరమే నేడు రక్తదాన ఉద్యమంగా మారింది. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.



కీలకమైన స్థితిలో మనిషి ప్రాణాలను కాపాడుతుంది రక్తదానం. అందుకే అన్నిదానాల కంటే రక్త దానం గొప్పదంటారు. రక్తం ఇచ్చిన వారెవరో తెలియకపోయినా ఆ రక్తంతో తమ ప్రాణం నిలబడినందుకు వారి మధ్య రక్తసంబంధం ఏర్పడుతుంది. జిల్లాలో రికార్డు స్థాయిలో రక్తం ఇచ్చిన దాతగా ప్రొద్దుటూరుకు చెందిన గురివిరెడ్డిని పేర్కొంటారు. రక్తదానాన్ని ఉద్యమంగా తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించిన బోగా పార్వతమ్మ రక్తదాన సేవా సమితి వ్యవస్థాపకులు బోగా చిన్నయ్య, రక్తదాన ప్రచారమే పెద్ద వ్యాపకంగా పూర్తి స్థాయిలో ప్రచారం, అవగాహన నిర్వహిస్తున్న పట్టుపోగుల పవన్‌కుమార్, తారిఖ్ వంటి వీరి



రక్తదానం చేస్తున్న మహిళ

స్ఫూర్తితో ప్రస్తుతం జిల్లాలో దాదాపు 100కు పైగా రక్తదాన సంస్థలు వెలిశాయి. రాజకీయ పార్టీలు కూడా స్పందించి పార్టీలో ఓ విభాగాన్ని రక్తదానం కోసం ఏర్పాటు చేయడం విశేషం.

ఉద్యమకర్త బోగా చిన్నయ్య

కడప నగరానికి చెందిన బోగా చిన్నయ్య జిల్లాలో రక్తదాన ఉద్యమకర్తగా పేరుగాంచారు. అవసరానికి అర్థం లభించక తన సతీమణిని కోల్పోవడంతో ఆ అంశంపట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని నిర్ణయించుకున్నారు. తన సతీమణి పేరిట బోగా పార్వతమ్మ రక్తదాన సేవా సమితిని ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం ప్రారంభించారు. తన ఆస్తిని పూర్తిగా ఈ ఉద్యమానికే ఖర్చు చేశారు. 'ట్రిమా ఆక్సెల్' యంత్రంతోపాటు పలు రక్త పరీక్షలు, నిర్ధారణ చేసే ఖరీదైన యంత్రాలను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఆయన స్ఫూర్తితో నేడు వేలాది మంది రక్తదాతలుగా మారారు. 20 సంవత్సరాల క్రితం ఆయనతో ఒంటరిగా ప్రారంభమైన రక్తదాన ప్రచారం నేడు జిల్లా వ్యాప్తంగా వందకు మించి రక్తదాన సంస్థలు వెలిసేందుకు స్ఫూర్తినిచ్చింది.

ఖూన్ కా రిస్తా

2015లో సంస్థ ఏర్పాటైంది. స్థానిక యువకులు ఎం.తారిఖ్ అలీ, ఎస్ఎండీ గౌస్‌ఖాన్ స్థాపించారు. రక్తం కొరతతో ఎవరికీ ప్రాణాపాయం కలగకూడదన్న భావనతో ఏర్పాటైన ఈ సంస్థ కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రలతోపాటు జిల్లాలోని ఇతర పట్టణాల్లో కూడా సేవలందిస్తోంది. రక్తం అవసరమున్న వారు 99481 04130 నెంబరులో సంప్రదిస్తే వెంటనే తమ సభ్యులను సంప్రదించి అవసరమైన రక్తదాతను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు 6400 మందికి పైగా రక్తం అందించారు. 219 రక్తదాన శిబిరాలు, 318 రక్త నిర్ధారణ శిబిరాలు, 30 వేల రక్తదాతల పేర్ల నిర్వహణ, 19,230 మందితో రక్తదానం చేయించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఒకరిద్దరికైనా రక్తం అందిస్తున్నారు. మసీదులు, చర్చిలు, దేవాలయాల వద్ద శిబిరాలు నిర్వహించి రక్తం సేకరిస్తున్నారు. జిల్లాలో మంచి రక్తదాన సంస్థగా అతి తక్కువ సమయంలోనే ఈ సంస్థ పేరు గడించింది.

రక్తదానం ఓ వరం



మనిషిని బ్రతికించగలిగే శక్తి దైవం తర్వాత వైద్యునికే ఉంది. కానీ సాటి మనిషిగా మనం రక్తదానం ద్వారా మరో మనిషికి ప్రాణదానం చేసిన తృప్తి పొందవచ్చు. సరైన సమయానికి రక్తం లభించక వ్యక్తి ప్రమాదంలో పడితే కలిగే బాధను అందరూ గమనించాలి. మనిషికి ఇచ్చిన ఈ అపురూపమైన వరాన్ని తప్పక వినియోగించుకోవాలి. ప్రతి సంవత్సరం కనీసం రెండు సార్లు రక్తదానం చేయాలి. **- తారిఖ్ అలీ, కడప**

బ్లడ్ టు లివ్

యువకుడైన పట్టుపోగుల పవన్‌కుమార్ ప్రస్తుతం రక్తదాన ప్రచార కర్తగా విస్తృత స్థాయిలో రక్తదానంపై అవగాహన కల్పించారు. అవసరమైన ప్రచార సామగ్రిని సమకూర్చుకుంటూ విద్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో ప్రచారం చేయడమే కాకుండా ఆ ఉద్యోగులతో ఏటా తప్పనిసరిగా రక్తదానం చేయించారు. అటు రెడ్‌క్రాస్ సంస్థకు సహకరిస్తూ ప్రభుత్వానికి కూడా రక్తదాన విషయంగా తనవంతుగా సేవలు అందించారు. మరో వ్యాపకం అంటూ లేకుండా సంవత్సరం పొడవునా పవన్‌కుమార్ రక్తదాన ప్రచారం, శిబిరాలు ఏర్పాటుతోనే తలమునకలుగా ఉంటారు.

ఎందరో బంధువులు



రక్తదాన ఉద్యమంతో నాకు వందలాది మందితో రక్త సంబంధం ఏర్పడింది. వారంతా ఆత్మబంధువులుగా మారారు. దీన్ని ఉద్యమ స్థాయిలో తీసుకు వెళ్లేందుకు నేను చేస్తున్న కృషి అందరి సహకారంతో మంచి ఫలితాలనిస్తోంది. రక్తదాన సేవను ధనంతో లెక్కకట్టలేం. ఈ అనుబంధాన్ని మాటల్లో కూడా చెప్పలేం. అవసరమైనపుడు రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడం గొప్పవరం. **- పట్టుపోగుల పవన్‌కుమార్**

అవగాహన అవసరం



పట్టణాలు, నగరాల్లో రక్తదానంపై అవగాహన ఉంది. నేను 70 సార్లు రక్తదానం చేశాను. కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఈలోటు కనిపిస్తుంది. వారిలో కూడా రక్తదానంపై అవగాహన కల్పిస్తే అవసరమైన సమయంలో రక్తానికి లోటు ఉండదు. ప్రస్తుతం కళాశాల విద్యార్థులు, యువత ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలపై ఆధారపడుతున్నాం. విద్యార్థులకు రక్త గ్రూపుల నిర్ధారణ చేయిస్తున్నాం. టీసీలలో ఆ గ్రూపులను నమోదు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలి. **- జి.శివశంకర్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కడప**

ఇవ్వడమే కాదు... ఇప్పిస్తారు



అబూబకర్‌సిద్దిక్

రక్తం ఇవ్వడమే కాదు. అవగాహన కల్పించి ఇతరులతో ఇప్పించడం కూడా గొప్ప విషయమే. ఈ విషయంలో రెండో కోవకు చెందుతారు అబూబకర్‌సిద్దిక్. మదనపల్లెలో హెల్పింగ్‌మైండ్స్ సంస్థను ఏర్పాటు చేశారు. తరచూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తారు. అంతే కాకుండా అత్యవసర సమయంలో ఎవరైనా ఫోన్ చేస్తే వారికి రక్తం ఇస్తారు. ఇప్పటి వరకు 43 సార్లు రక్తదానం చేశారు. సంస్థ తరఫున పదేళ్లలో సుమారు 18వేల మందితో రక్తదానం చేయించారు.

చిరు వ్యాపారి.. రక్తదానంలో మేటి



హర్షద్‌అలీ

మదనపల్లె పట్టణానికి చెందిన హర్షద్‌అలీ చిరు వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. స్నేహితుడు అనారోగ్యం పాలవడంతో ఓ గ్రూపు రక్తం అవసరమైంది. దొరకకపోవడంతో ఇబ్బందులు పడ్డాడు. అప్పటి నుంచి రక్తంతో ఎవరూ ఇబ్బందులు పడకూడదని రక్తదానం చేస్తున్నాడు. ఇప్పటి వరకు 44 సార్లు రక్తదానం చేశాడు.

ఆపద వస్తే.. వాలిపోతాడు



ధంకనాచారి

స్వర్ణకారుడిగా పని చేస్తూ స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నాడు మదనపల్లె పట్టణానికి చెందిన ధంకనాచారి. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసే తృప్తి ఎందులోనూ ఉండదని నమ్మిన యువకుడు. ఇప్పటి వరకు 46 సార్లు రక్తదానం చేసి అందరి మన్ననలు పొందాడు.

-మదనపల్లె సిటీ

ఆహార అలవాట్ల మార్పులతో క్యాన్సర్ నివారణ

డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి

ప్రొద్దుటూరు క్రైం: జీవన విధానంలో కొన్ని ఆహారపు అలవాట్లను మార్పు చేసుకోవడం వల్ల క్యాన్సర్ నుంచి విముక్తి పొందవచ్చని డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో గురువారం వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలకు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ ప్రస్తుతం దేశ వ్యాప్తంగా క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయన్నారు. ఈ వ్యాధి రాకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

శిక్షణ తీసుకున్న అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో క్యాన్సర్ గురించి అవగాహన కల్పించి, ప్రాథమిక దశలోనే గుర్తించేలా స్క్రీనింగ్ చేస్తారన్నారు. ప్రజలందరూ వారి జీవన విధానాన్ని మార్చుకొని మంచి ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఏదైనా ఆరోగ్య సమస్యలుంటే దగ్గరలోని



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

ఆస్పత్రికి వెళ్లి చూపించుకొని క్యాన్సర్ వ్యాధి రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. క్యాన్సర్ వచ్చిన వారు తగిన చికిత్స తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, రిసోర్స్‌పర్సన్స్ డాక్టర్ మీనాకుమారి, డాక్టర్ మంజుల , వెంకటరమణ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో గురువారం మూడు నెలలకు గాను ఆరు హుండీలను లెక్కించారు. ఈ మేరకు రూ.46లక్షలు నగదు. 36గ్రాముల బంగారు ఆభరణాలు, 640 గ్రాములు వెండి వస్తువులు వచ్చినట్లు మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రిస్వామి, గోవిందస్వామి, దత్తస్వామి, బ్రహ్మయ్యస్వామి, ఎండోమెంట్ అధికారులు, మఠం సిబ్బంది. భక్తులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జిల్లా విద్యాశాఖాధికారి అనూరాధ

చింతకొమ్మదిన్నె: మానవ మనుగడకు అతి ముఖ్యమైన పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ పేర్కొన్నారు. పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా మేరీ లైఫ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. తొలుత స్థానిక మండల విద్యాశాఖ అధికారులు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో తొలి రోజు వ్యర్థాల నిర్వహణ గురించి అవగాహన కల్పించాలని, ప్రతి పాఠశాల ఆవరణం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి విద్యార్థికి పాఠశాల స్థాయి నుంచే పర్యావరణంపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ, ఇంధన పొదుపు, సరైన పోషణ గురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. అనంతరం



మొక్క నాటి నీరు పోస్తున్న డీఈఓ అనూరాధ

స్టూడెంట్ కిట్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటరామిరెడ్డి, రమాదేవి, సమగ్ర శిక్ష అధికారులు దశరథ రామిరెడ్డి, మిట్టా కేశవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఉపాధ్యాయులు గంగాధర్, ప్రతాప్, గురవయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

డీ ఫార్మసీతో ఉజ్వల భవిష్యత్తు



- వందశాతం ప్లేస్‌మెంట్
- పేద, మధ్య తరగతి బాలికలకు వరం
- కడపలో ప్రభుత్వ రంగ ఏకైక మహిళా పాలిటెక్నిక్ కాలేజ్
- ఈనెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు



కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల

కడప ఎడ్యుకేషన్: పేద, మధ్య తరగతి విద్యార్థులు తక్కువ వ్యవధిలో తమ కాళ్లపై తాము నిలబడేలా డీ ఫార్మసీ కోర్సు భరోసానిస్తోంది. పాలిటెక్నిక్ విద్యలో భాగంగా ఒక బ్రాంచ్‌గా ఉన్న డిప్లమా ఇన్ ఫార్మసీ(డీ ఫార్మసీ) కోర్సును రెండేళ్ల కాలపరిమితో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించింది. ఫార్మసీ రంగంలో ఉన్నతంగా స్థిరపడేందుకు తొలి మెట్టుగా ఇది ఉపయోగపడుతుంది. తరగతి గదిలో పాఠ్యాంశాల ఆధారిత విజ్ఞానంతోపాటు క్షేత్రస్థాయి సందర్శనాల ద్వారా ప్రాక్టికల్ నాలెడ్జ్ పంచుకునే విధంగా కోర్సును రూపకల్పన చేశారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది.

విద్యార్హత ఇలా...

ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ రెగ్యులర్‌తో పాటు దూరవిద్య ద్వారా పూర్తి చేసిన విద్యార్థినులకు ఇంటర్ మార్కుల ఆధారంగా ర్యాంకులను కేటాయిస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థినిలు ఈ నెల 15లోపు https:/apsbtet.in/pharmacya లేదా htpps: apsbtet.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తరువాత ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ర్యాంకులను బట్టి ప్రవేశాలు కల్పిస్తారు.

రెండేళ్ల కోర్సుకు సంబంధించి....

డీ ఫార్మసీ రెండేళ్ల కోర్సుకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో మొత్తం 11 సబ్జెక్టులు ఉంటాయి. ఆంగ్లమాధ్యమంలో బోధన ఉంటుంది. కోర్సులో భాగంగా ఔషధాలను తయారు చేయటం, మానవ శరీర అవయవాలపై అవి పని చేసే విధానం , ఔషద మొక్కలు, ఫార్మసీ చట్టాలు, ఫార్మసిస్టుగా, డ్రగ్ డిస్పెన్సింగ్, పేషంట్ కౌన్సిలింగ్‌పై అవగాహన కల్పిస్తారు.



నాలుగు జిల్లాల్లో కడపలో ఏకైక కళాశాల..

రాయలసీమలోని కడప, కర్నూల్, చిత్తూరు, అనంతపురం జోన్ -4కు ప్రత్యేకించి బాలికల కోసం డీఫార్మసీ కోర్సును కడప రామాంజనేయపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు మినహాయింపుతోపాటు ఉపకార వేతన పొందేందుకు కూడా అవకాశం ఉంది,

హాస్టల్ సౌకర్యం ప్రత్యేకం..

కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో చదివే విద్యార్థులకు అన్ని బోధనా వసతులతో పాటు ప్రత్యేకంగా హాస్టల్ వసతి ఉంది. హాస్టల్ కూడా కళాశాలలోనే ఉండటంతో బాలికలకు పూర్తిస్థాయిలో సంరక్షణ ఉంటుంది. ధైర్యంగా చదువుకునేందుకు వీలుంటుంది. నాలుగు జిల్లాలలో ఎక్కడి నుంచి విద్యార్థినిలు వచ్చినా వారి వసతికి సంబంధించి ఎలాంటి సమస్య ఉండదు.

ఉపాధి అవకాశాలు ఇలా..

డి ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన వెంటనే విస్తృత రీతిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కమ్యూనిటీ ఫార్మసిస్టు, హాస్పిటల్ ఫార్మసిస్టు, మార్కెటింగ్ డ్రగ్ రిప్రజెంటేటివ్‌గా ఫార్మసిస్టు ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఔషధ దుకాణాలలో రిటైల్ ఫార్మసిస్టులుగా ఉద్యోగాలను అందిపుచ్చుకోవచ్చు. ఆర్థిక స్థోమత ఉంటే తాము సొంతంగా ఔషధ దుకాణం ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతూ మరి కొంతమందికి ఉపాధి కల్పించవచ్చు. పరిశ్రమలు, రైల్వే ఆసుపత్రులో ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఈ రంగంలో వేతనాలు అధికంగా ఉన్నందున ఎక్కడయినా ఉపాధికి భరోసా ఉంటుంది. డీ ఫార్మసీ కోర్సు చదివిన తరువాత ఉన్నత చదువులకు ఈసెట్ ద్వారా బి ఫార్మసీ రెండవ ఏడాదిలోకి ప్రవేశం పొందవచ్చు.

వందశాతం ఉపాధి



గత విద్యా సంవత్సరంలో కళాశాల నుంచి డీ ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థినులకు అపోలో ఫార్మసీలో వందశాతం ఉద్యోగాలను కల్పించాం. ఆసక్తి గల విద్యార్థినులు ఈ నెల 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కళాశాల ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు పంపడంలో సహాయం అందిస్తాము. ప్రవేశాల సమచారానికి 7981353745, 9440144057 నెంబర్‌ను సంప్రదించాలి. **- సిహెచ్ జ్యోతి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కడప**

వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలకు అదనపు సీట్లు



ప్రొద్దుటూరులోని వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల (యోగివేమన యూనివర్సిటీ)కు అదనంగా 130 సీట్లకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చిందని కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య సి.నాగరాజు తెలిపారు. కళాశాలలో ఉన్న ఆరు కోర్ బ్రాంచ్‌లకు అదనంగా ప్రతి విభాగానికి 20 చొప్పున, మెటలర్జీ విభాగానికి 30 సీట్లు చొప్పున మొత్తం 130 సీట్లకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. మే 20న ఏఐసీటీఈ కమిటీ వారు వర్చువల్ పద్ధతిలో కళాశాలను తనిఖీ చేశారని తెలిపారు. కళాశాలలో అన్ని మౌలిక వసతులు అనగా ఫ్యాకల్టీ, బోధనేతర సిబ్బంది, ప్రయోగశాలలు, గ్రంథాలయం, విద్యార్థుల ప్లేస్‌మెంట్, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, కళాశాల భవనాలు, కళాశాల ప్రాంగణం తదితర అంశాలను ఏఐసీటీఈ నిబంధనలకు లోబడి ఉన్నాయని గుర్తించారన్నారు. ఈ మేరకు 2024-25 సంవత్సరం నుంచి కళాశాలకు అదనపు సీట్లు మంజూరు చేశారని తెలిపారు. కళాశాలకు అదనపు సీట్ల మంజూరుపై ప్రధానాచార్యులతో పాటు కళాశాల డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ ఆచార్య కేవీ రమణయ్య, హెచ్ఓడీలు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేస్తే ఉపయోగకరం

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ పోస్టులపై క్షేత్ర స్థాయిలో నివేదిక తీసుకుని, అన్ని ఖాళీలు భర్తీ చేస్తే నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మన రాష్ట్రంలో 30 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నట్లు గతంలో పార్లమెంటులో కూడా చెప్పారని, అయితే ప్రస్తుతం 16 వేల పోస్టులు మాత్రమే డీఎస్సీలో భర్తీ చేస్తున్నారని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


మృతి చెందిన రమణమ్మ

కాశినాయన : మండలంలోని అమగంపల్లె గ్రామానికి చెందిన బుర్రారమణమ్మ (55) విద్యుత్ షాక్‌తో గురువారం మృతి చెందింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రమణమ్మ చింతచెట్టు ఎక్కి చిగురు కోస్తుండగా ఆ చెట్టుపైనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త సుబ్బయ్యతోపాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాశినాయన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కడప–పులివెందుల రహదారిలో గల రోడ్డు కృష్ణాపురం వద్ద వేంపల్లి వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వల్లూరు మండలం సితూరిపల్లి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డిగా గుర్తించారు. అతన్ని చికిత్స నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు.

స్థల వివాదంపై విచారణ

కడప అర్బన్ : కడప నగర శివారులోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధి మద్రాస్ రోడ్డులో రాజరాజేశ్వరి కల్యాణ మండపం సమీపంలో ఓ ప్రైవేట్ స్థలంలో గురువారం ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న రిమ్స్ పీఎస్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాల వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. తమ దగ్గరున్న డాక్యుమెంట్లను తీసుకుని రావాలని వారికి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ కె.రామచంద్ర మాట్లాడుతూ వారి డాక్యుమెంట్లను పరిశీలించి, వాస్తవాలను తెలుసుకునేందుకు కడప తహశీల్దార్‌కు లెటర్‌ను పంపిస్తామని పేర్కొన్నారు.

కాటేసే కాలం..
అప్రమత్తత అవసరం




- ఆరంభమైన వర్షాకాలం
- విషపురుగులైన పాము, తేళ్ల సంచారం అధికం
- పొలాల్లో గడ్డిమాటున పొంచి ఉన్న ప్రమాదాలు

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

రైతులు పొలాల గట్టు మీద నడుచుకుంటూ వెళ్తున్న తరుణంలో కర్రచప్పుడు చేస్తూ నడవడం మంచిది. రాత్రి పూట పొలాలకు వెళ్లే రైతులు టార్చిలైట్ వెనుకుంటూ వెళ్లాలి. ముఖ్యంగా ధాన్యపు బస్తాలు నిల్వ ఉండే చోట్ల, గడ్డివాములు ఉండే ప్రాంతంలో ఎలుకలు, కప్పలు ఎక్కువగా తిరుగుతూ ఉంటాయి. వాటిని తినేందుకు పాములు అక్కడికి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గడ్డివాముల దగ్గర సరైన శుభ్రత లేకపోతే తేళ్లు, పాములు చేరుకునే ప్రమాదం ఉంటుంది. కావున గడ్డివాముల దగ్గరకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా కాళ్లకు చెప్పులు వేసుకుని వెళ్లాలి. దీంతోపాటు గడ్డివాముల చుట్టూ శుభ్రంగా ఉంచుకోవాలి. దీంతో విషపురుగుల సంచారం అంతగా ఉండదు.

కడప అగ్రికల్చర్ : మండే ఎండల నుంచి ఉపశమనం లభించింది. జిల్లాలో రుతుపవనాల రాకతో తొలకరి వర్షాలు మొదలయ్యాయి. ఫలితంగా వాతావరణం చల్లబడుతోంది. ఇదే సమయంలో భూమిలో నుంచి విష పురుగులు, పాములు బయటకు వస్తాయి. ఇలా వచ్చిన అవి పొదలు, గుట్టల్లో రాళ్లకింద దాక్కుని ఉంటాయి. అటుగా వెళ్లిన వారు ఆదమరిస్తే కాటేసే ప్రమాదం ఉంది. ఇందులో సాధారణ సర్పాలైతే ఏమీ కాదు. అదే విష సర్పాలైతే మాత్రం ప్రాణాల మీదకు వచ్చినట్లే. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్ ఆరంభం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా రోజూ ఎక్కడో ఒక చోట వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో రైతన్నలు పొలం బాట పడుతున్నారు. ఈ తరుణంలోనే భూమి పొరలు, రాళ్లు, రప్పల్లో దాగి ఉన్న పాములు, తేళ్లు బయటకు వచ్చే అవకాశం ఉంది. ఈ తరుణంలో అటుగా వెళ్తున్న వారు తమపై దాడి చేస్తారేమోనని అవి ముందుగానే కాటేసే అవకాశం ఉంటుంది. కావున వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే రైతులు పాములు, తేళ్లతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పైగా ఇటీవల కురిసిన వర్షాలకు గట్లపైన, బీడు భూముల్లో పచ్చిక బాగా మొలకెత్తింది. ఈ పచ్చగడ్డిలో కూడా విష పురుగులు దాగి ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. గతంలో పాము, తేలు కాటులకు గురై ఎందరో ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు.

పాములు.. విషప్రభావం

కట్లపాము : ఇది కాటు వేసిన క్షణాల్లోనే విషం రక్తకణాల్లో కలుస్తుంది. వెంటనే ఆసుపత్రిలో చేర్పించాలి.
నాగుపాము : ఇది కాటేసిన 15 నిమిషాల్లోనే శరీరంలోకి విషం ఎక్కుతుంది.
రక్త పింజర : ఇది కాటేసిన రెండు గంటల్లో విషం శరీరంలోకి ఎక్కుతుంది.
జెర్రిపోతు : నీరుకట్టు పురుగు. ఇవి కాటేసినా విషం ఉండదు. అయినా ఆసుపత్రిలో చికిత్స అవసరం.

అన్ని పాములు ప్రమాదకరం కాదు

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. కట్లపాము, నాగుపాములే ప్రమాదరకమైన సర్పజాతులు. వీటితోనే ఎక్కువ ప్రమాదం ఉంటుంది. సాధారణంగా కొన్ని పాముల విషంతో ప్రమాదం ఏమీ ఉండదు. అది కరిస్తే కేవలం గాయం మాత్రమే అవుతుంది. సాధారణ వైద్యంతో నయమవుతుంది. పాము కాటు వేసిన చోట కట్టు కట్టాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. పాము కాటుకు గురైన వ్యక్తులు ఆందోళన చెంది గుండెపోటుకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ధైర్యంగా ఉంటే ప్రాణాలు రక్షించుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

పాము కాటును బట్టి చికిత్స

పాము గాట్లను బట్టి కాటేసింది విషపు పామా కాదా నిర్ధారణ అవుతుంది. పాము కాటులో రెండు కోరల మధ్య దూరం, లోతును బట్టి వైద్యులకు తెలుస్తుంది. పాము కరిచిన చోట నీలంగా, వంగపండు రంగులా మారుతుంది. ఉబ్బులా, లావుగా అవుతుంది. ఈ లక్షణలను బట్టి విషపుపాముగా గుర్తించవచ్చు. వెంటనే ఆసుపత్రికి తరలించి తక్షణం వైద్య సేవలందించాలి. కానీ కొందరు పాము కాటు వేయగానే అక్కడ కోస్తే రక్తంతోపాటు విషం బయటకు వస్తుందని కత్తి, బ్లేడులతో గాటు పెడతారు. అలా చేయకూడదు, ఒక్కోసారి పాము కాటు కన్నా ఈ గాయం ప్రమాదకరంగా మారవచ్చు. పాము కరిచిన చోట గాటు పెట్టి పీల్చేస్తూ ఉంటారు. కానీ అది తప్పే. ఎందుకంటే పాముకాటు మేయగానే విషం రక్తం ద్వారా శరీరంలోకి అన్ని భాగాలకు, గుండెకు చేరుతుంది. కాబట్టి దానివల్ల ప్రయోజనం ఉండదు. ఒక్కోసారి ప్రాణహాని కూడా కలగవచ్చు. కావున పాము గానీ, తేలు గానీ కరిచిన వేంటనే వైద్యులను సంప్రదించాలి.

పాము కరిస్తే లక్షణాలివే..

- పాము కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి, నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- విషం క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షపాతం రావచ్చు. దీంతోపాటు నాలుక మందమైనట్లు గొంతు కండరాలు బిగుసుకున్నట్టు ఉండి, గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

నాటు మందు చికిత్స సరైనది కాదు



పాము కాటుకు గురైన వ్యక్తులకు నాటు మందులు, ఆకు పసురు మందులు వంటి వాటిని వేయకూడదు. ఇది మరింత ప్రమాదకరం. పాము కాటుకు గురైన వ్యక్తిని తక్షణం దగ్గరలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. ముందుగా పాముకాటుకు గురైన వ్యక్తికి గడ్డకట్టే విషమా లేక నరాలు బిగుసుకునే విషమా అనేది గుర్తించి చికిత్స ప్రారంభించాలి. అలా చేస్తే ప్రమాదం ఉండదు. ఏది ఏమైనా పాముకాటుకు గురైన వ్యక్తులకు వీలైనంత త్వరగా ప్రారంభించాలి. అప్పుడు ప్రాణాపాయం అంతగా ఉండదు. – డాక్టర్ అవ్వారు అర్జున్‌కుమార్, ప్రముఖ వైద్యులు, రిమ్స్, కడప.

మందులు అందుబాటులో ఉన్నాయి



జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పాముకాటుకు సంబంధించిన ఏఆర్‌వీ, యాంటి స్నేక్ వీణమ్ మందులు అందుబాటులో ఉన్నాయి. కావున ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పాముకాటుకు గురైన వారు తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్య సేవలను పొందవచ్చు. – డాక్టర్ నాగరాజు, డీఎంహెచ్‌ఓ, కడప.

కోలుకుంటున్న పులుసుగుంతల

- విరేచనాలు, వాంతులతో బాధపడిన గ్రామస్తులు
- తాగునీటి కలుషితం వల్లే జరిగి ఉంటుందని అంచనా


ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కురబలకోట : మండలంలోని పులుసుగుంతల గ్రామం క్రమేణా కోలుకుంటోంది. మూడు రోజుల క్రితం ఒకరు మృతి చెందడంతోపాటు ఊరంతా వీటితో వణికింది. ఐదుగురు తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి కూడా పార్వతమ్మ (45) అనే మహిళ అస్వస్థతకు గురైనా వైద్య సిబ్బంది అప్రమత్తతతో తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నారు. వైద్యాధికారులు రాత్రింబవళ్లు ఊరిలోనే వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షిస్తున్నారు. అప్రమత్తంగా ఉంటూ వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 27 మందికి వైద్య సేవలు అందించగా వారంతా కోలుకున్నట్లు మండల వైద్యాధికారి కె. శ్రీధర్ గురువారం తెలిపారు. కారణం ఏమిటన్నది తెలుసుకోడానికి రక్త నమూనాలను తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు పంపినట్లు ఆయన తెలిపారు. తాగునీటి కలుషితం వల్లే ఇలా జరిగి ఉండవచ్చని వైద్యాధికారులు కూడా ప్రాథమిక అంచనాకు వచ్చారు. తిరుపతి రుయా, మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిలో సగం మంది కోలుకుని గురువారం ఇళ్లకు చేరుకున్నారు. అందరూ పూర్తిగా కోలుకుని సాధారణ పరిస్థితికి వచ్చే వరకు వైద్య శిబిరం కొనసాగిస్తామని మండల వైద్యాధికారి తెలిపారు.

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలి


అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్ : విద్యుత్ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ ఆదేశించారు. గురువారం స్థానిక కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో కడప డివిజన్ పరిధిలో కడప, సీకే దిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలను తాకకుండా, విద్యుత్‌ను కొక్కెముల ద్వారా కాకుండా నాణ్యమైన సర్వీసు వైరు ద్వారా తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి మరమ్మతులనైనా విద్యుత్ శాఖ సిబ్బందితోనే చేయించుకోవాలన్నారు. ఎర్తింగ్ సక్రమంగా చేయించుకోవడం వల్ల విద్యుత్ పరికరాల వల్ల కలిగే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. విద్యుత్‌కు సంబంధించిన ఫిర్యాదులను 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలుపవచ్చన్నారు. ఈ సమావేశంలో కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్.నరసింహ ప్రసాద్, డీఈలు, ఏఈలు, జేఈలు, ఏఓలు పాల్గొన్నారు.

బస్సుల కండీషన్‌తోనే మెరుగైన సేవలు


మాట్లాడుతున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణికులను సకాలంలో గమ్యస్థానాలకు చేర్చేందుకు బస్సులు మెరుగైన కండీషన్‌లో ఉండాల్సిన అవసరాన్ని గుర్తించాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. కడపలోని ఆర్ఎం కార్యాలయ సమావేశ భవనంలో మెకానిక్‌లు, ఇతర సిబ్బందికి తమ నైపుణ్యాన్ని పెంచుకునేలా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ నిపుణులు సూచించే అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాలన్నారు. బస్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యవాదులు ఆలోచించాలి


మాట్లాడుతున్న ప్రజాపక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి

ప్రొద్దుటూరు : కోటీశ్వర్లు, నేరగాళ్లు, క్రిమినల్ రికార్డులు ఉన్న వారు, బ్యాంకులకు డబ్బు ఎగవేతదారులు ఎంపీలు అవుతుంటే.. ప్రజాస్వామ్యవాదులు ఆలోచించాలని ప్రజాపక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి కోరారు. గురువారం ప్రొద్దుటూరులోని తమ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. భారత లోక్‌సభలో 543 మంది ఎంపీలు ఉంటే 2009 లోక్‌సభలో 315 మంది, 2014 లోక్‌సభలో 443 మంది, 2019 లోక్‌సభలో 475 మంది కోటీశ్వర్లుంటే 2024 లోక్‌సభలో 504 మంది కోటీశ్వర్లు ఉన్నారని తెలిపారు. 2023లో దేశంలో 25 కోట్ల మంది పేదరికంలో ఉన్నారని, 11.2 శాతం దారిద్ర్య రేఖ దిగువన ఉన్నారని నీతి అయోగ్ వెల్లడించిందని తెలిపారు. 2024 లోక్‌సభకు ఎన్నికైన ఎంపీలలో 50 శాతం మందిపై క్రిమినల్ కేసులు, 46 శాతం మందిపై క్రిమినల్ రికార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. అందులో 15 మంది.. మహిళలపై అత్యాచారాలు చేసిన వారు ఉన్నారని చెప్పారు.

ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, హెల్పర్ల నిరసన


నిరసన తెలుపుతున్న ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు, హెల్పర్‌లు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వద్ద గురువారం ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు, హెల్పర్‌లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రెసిడెంట్ షరీఫ్ హుస్సేన్ మాట్లాడుతూ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్ సతీష్‌కుమార్ తమ పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో కొన్నేళ్లు అయినా తమ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డిపో మేనేజర్ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా

- కార్ వాష్‌స్టేషన్, హోటల్ నిర్మాణం
- హైవేకు ఆనుకుని ఆక్రమణ జరిగినా గుర్తించని అధికారులు
- ఎన్నికల సమయంలో ఆక్రమించారన్న వీఆర్వో



బైపాస్ రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన కార్‌వాష్ సర్వీస్‌సెంటర్, చేపడుతున్న హోటల్ నిర్మాణ పనులు

మదనపల్లె : పట్టణంలోని బండమీద కమ్మపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలో అనంతపురం–కృష్ణగిరి జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న రూ.10 కోట్లకు పైగా విలువచేసే ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. ఆ స్థలం చుట్టూ కబ్జాదారులు ఫెన్సింగ్ నిర్మించి, కార్ వాష్ సర్వీసింగ్ ఏర్పాటుతోపాటు హోటల్ నిర్మాణానికి లీజుకు ఇచ్చారు. నేషనల్ హైవేపై ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. పట్టణంలోని బండమీద కమ్మపల్లె రెవెన్యూ గ్రామ పరిధి సర్వే నంబర్ 552/5లోని స్థలానికి 1969లో ఆకుల సిద్ధప్ప పేరుమీద డీకేటీ పట్టా ఉంది. దీనిని 2002లో 179/2002 వీలునామా ద్వారా ఆకుల రామాంజులు పేరు మీద బదిలీ చేశారు. 2017లో రామాంజులు చనిపోయారు. ఇతడి కుమార్తె శ్రీప్రియ మెడిసిన్ చదివి కువైట్‌లో ఉద్యోగం చేసేందుకు వెళ్లింది. ప్రస్తుతం 552/5 సర్వే నంబర్ రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వస్థలంగా నమోదైంది. భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో పట్టాదారుడు, అనుభవదారుడిగా ఎవరి పేరు నమోదు కాలేదు. దీంతో భూమిపై కన్నేసిన కబ్జారాయుళ్లు... నకిలీ పాసుపుస్తకాలు, పట్టా సృష్టించుకుని, సుమారు 10 కోట్లు విలువ చేసే 30 కుంటల స్థలాన్ని దర్జాగా ఆక్రమించేశారు. ఆక్రమిత స్థలంలో ఫెన్సింగ్ వేసుకుని నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నించారు. గమనించిన రెవెన్యూ అధికారులు ఆక్రమణలను అడ్డుకుని, నిర్మాణాలు చేయవద్దని హెచ్చరించారు. దీంతో అప్పుడు వాయిదా వేసుకున్న కబ్జారాయుళ్లు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లో తలమునకలైన సందర్భంలో తెలివిగా వ్యవహరించి, ఆక్రమణ స్థలంలో నిర్మాణాలు చేపట్టి కార్ వాష్ సర్వీస్ సెంటర్, హోటల్‌కు లీజుకిచ్చేశారు. ఈ విషయమై వీఆర్వో మునస్వామిని వివరణ కోరితే.. ఆక్రమణ విషయాన్ని తహసీల్దార్, ఆర్ఐల దృష్టికి తీసుకెళ్లానని, హోటల్ పనులు నిలిపేయాల్సిందిగా ఆక్రమణదారులను హెచ్చరించినట్లు చెప్పారు. నిర్మాణాలను తొలగించకపోతే, జేసీబీతో తీసివేయిస్తామన్నారు. రెవెన్యూ అధికారులు విలువైన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నీట్ పరీక్షపై విచారణ జరిపించాలి

బద్వేలు అర్బన్ : నీట్ పరీక్ష అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం నీట్ ప్రశ్నాపత్రాన్ని లీక్ చేసి ప్రతిభ గల విద్యార్థులతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు పరీక్షలు తిరిగి నిర్వహించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నాగార్జున, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట గ్రామం వైశ్యబజార్‌కు చెందిన కృష్ణమూర్తి కుమారుడు కె.శ్రీనివాసులు(35) కుటుంబ సమస్యలతో టమాట పంటకు కొట్టే పురుగుల నివారణ మందు తాగి ఇంటి వద్దే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విధంగా ములకలచెరువు గ్రామంలోని పీటీఎం రోడ్డులో నివాసం ఉంటున్న వెంకటరమణ కుమారుడు టి.అశోక్(25) కుటుంబ సమస్యలతో భార్య పుణ్యవతితో గొడవపడి మనస్తాపంతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సచివాలయ బోరు సర్వీస్ వైరు చోరీ

వీరబల్లి : మండలంలోని దిగువరాచపల్లి పంచాయతీలో గత ప్రభుత్వంలో నిర్మించిన సచివాలయం దగ్గర వేసిన బోరు విద్యుత్ సర్వీసు సరఫరా వైరును బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఆ గ్రామ సర్పంచ్ నాగులమ్మ తెలిపారు. సచివాలయం, రైతు భరోసా, హెల్త్ క్లీనిక్‌లకు నీటి సరఫరా కోసం అక్కడ బోరును ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఆ బోరుకు విద్యుత్ కూడా సరఫరా చేశారని, బోరు మోటార్ ఆడటానికి సర్వీస్ వైరును ఏర్పాటు చేయడం జరిగిందని, దీంతో సిబ్బందికి నీటి సమస్య లేకుండా ఉండేదన్నారు. ప్రస్తుతం సర్వీస్ వైరును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

చిన్నమండెం : మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. బైక్‌లో తల్లి, కొడుకు, మనువడు చింతమాకులపల్లె నుంచి రాయచోటికి వస్తుండగా కేశాపురం దేవళంపేటలో.. రాయచోటి నుంచి బెంగళూరు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన సుధాకర, గంగాధర్, మల్లమ్మను చికిత్స నిమిత్తం రాయచోటికి తరలించారు. అదే విధంగా చిన్నమండెం నుంచి రాయచోటికి బైక్‌పై వెళ్తున్న నజీర్ మల్లూరు క్రాస్ వద్ద డివైడర్ ఉండే కడ్డీని ఢీకొని కింద పడి గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. రింగ్‌రోడ్డు మిలిటరీ కాలనీలో నివాసం ఉన్న బాలయ్య కుమారుడు వై.రెడ్డెప్ప(40) తన స్నేహితుడు నవీన్‌తో కలిసి ద్విచక్రవాహనంలో అంగళ్లు నుంచి మదనపల్లెకు వస్తుండగా, విశ్వం కాలేజీ సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో రెడ్డెప్ప తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108కు సమాచారం అందించి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పాల ఉత్పత్తి కోసం పోషకాహారం అవసరం

వీరబల్లి : పాల ఉత్పత్తి పెరగాలంటే పశువులకు పోషకాహారం అందించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. గురువారం ప్రపంచ పాల ఉత్పత్తి దినోత్సవం సందర్భంగా ఆయన మండలంలోని మట్లి పంచాయతీలో పాడి రైతులకు పాల ఉత్పత్తిపై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులు గర్భం దాల్చిన దగ్గర నుంచి సరైన వైద్యం అందిస్తూ, టీకాలు వేయాలన్నారు. పశు వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటూ వైద్య పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య, గ్రామ సర్పంచ్ నాగార్జునాచారి, పశువైద్యాధికారి నాగరాజు, జేఎల్ఓ జయప్రకాష్, తిరుమలరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ ఢీకొని మహిళ మృతి

గుర్రంకొండ : ట్రాక్టర్ ట్రాలీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని సంగసముద్రం పంచాయతీ మామిళ్లవారిపల్లె వద్ద జరిగింది. మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ ఎగువకంపల్లెకు చెందిన అత్తులూరి రామ్మోహన్, సునీత దంపతులు 10 ఏళ్ల క్రితం గుర్రంకొండ పట్టణానికి వచ్చి నివాసముంటున్నారు. పెద్దమండ్యం మండలం తురకపల్లె వద్ద వీరు నర్సరీ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూ గుర్రంకొండ నుంచి తురకపల్లెకు వెళ్లి రాత్రి మళ్లీ ఇంటికి చేరుకుంటారు. బుధవారం రాత్రి నర్సరీ పనులు ముగించుకొని ఆటోలో గుర్రంకొండకు బయలుదేరారు. అదే సమయంలో పెద్దమండ్యం మండలం గుర్రంవాండ్లపల్లెకు చెందిన వెంకటరమణ అనే రైతు టమాటాలు గుర్రంకొండ మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చి తిరిగి ట్రాక్టర్ నడుపుకొంటూ స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో మామిళ్లవారిపల్లె వద్దకు చేరుకోగానే ట్రాక్టర్ టాలీ.. ఆటోలో ప్రయాణిస్తున్న సునీతను ఢీకొంది. బాధితురాలిని 108 వాహనం ద్వారా వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ సంఘటనపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు.